క్లుప్తంగా

రేషన్ సరకులు ఇవ్వాలని నిరసన



రేషన్ సరకులు ఇవ్వాలని నిరసన తెలుపుతున్న 63వ వార్డు ప్రజలు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవ గ్రామంలో రేషన్ సరకులు సకాలంలో ఇవ్వకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ సరకులు సరఫరా చేసే వాహనం వద్ద గురువారం నిరసన తెలిపారు. పౌరసరఫరాల శాఖ ద్వారా కేంద్రం అందిస్తున్న రేషన్ బియ్యం, పంచదార తప్పా కందిపప్పు, గోధుమపిండి వంటివి మూడు నెలలుగా ఇవ్వడం లేదని మండిపడ్డారు. వెంటనే రేషన్ డిపోల ద్వారా కందిపప్పు, గోధుమపిండి వంటివి సరఫరా చేయాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డులోని అన్ని కాలనీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. వినోద్ నగర్, కాకానినగర్ కాలనీ వాసుల సౌకర్యార్థం గెడ్డపై కల్వర్టు నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. కాలనీ వాసుల విన్నపం మేరకు దీన్ని ఆధునీకరించేందుకు రూ. 12.50లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ పబ్లిక్ వర్క్స్ విభాగం ఏఈ వెంకటలక్ష్మి, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రామ కృష్ణ, సోమేశ్, వినోద్ నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న కంచరపాలెం సీఐ రవికుమార్

మర్రిపాలెం: అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారం అందించాలని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ రవికుమార్ అన్నారు. నేరాల నియంత్రణపై గాంధీనగర్‌లో తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదని, భవిష్యత్తును అందంగా మలుచుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్టు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తు, ఎదుగుదల దృష్టిలో పెట్టుకుని వారిని గమనిస్తూ ఉండాలని అన్నారు. వారితో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారితో నిత్యం మాట్లాడుతూ ఉండాలన్నారు.

ఎన్‌ఎస్‌టీఎల్‌లో ఘనంగా మహిళా దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

గోపాలపట్నం: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ అన్నారు. ఎన్‌ఎస్‌టీఎల్ మానసి ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా కల్యాణ మంచ్ నిర్వహించిన వైద్య శిబిరంలో 120 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. బంగారుతల్లి వృద్ధాశ్రమానికి రూ.20వేల నగదు అందించారు. కార్యక్రమంలో శశి రాణి, దిన్న అబ్రహం, కె.సంగీత తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణం పూర్తయినా తొలగించని వ్యర్థాలు



రహదారికి అడ్డంగా వదిలేసిన పూడికలు

వారి నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం



తోటవీధి గెడ్డలో నిండిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న వ్యక్తి



ప్రధాన రహదారులో చెత్తకుప్ప ఇలా..



కంచరపాలెం: అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల వైఫల్యం... వెరసి ప్రజలకు శాపంగా మారింది. జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం దరి రైల్వే ట్రాక్ రహదారి గొల్ల కంచరపాలెం నుంచి గౌరీనగర్, దుర్గానగర్, తోటవీధి, పల్లివీధి, ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. అసంపూర్తిగా రోడ్లు, వంతెనల నిర్మాణాలు వదిలేయడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పలు వీధుల్లో కాలువలు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రధాన రహదారులు మురుగుతో నిండిపోతున్నాయి. అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

సమస్య కళ్ల ముందు కనిపిస్తున్నా..

తోటవీధిలో వంతెన పనులు ఇటీవల పూర్తి చేసినా వ్యర్థాలు నిర్లక్ష్యంగా వదిలేయడంతో సమస్య మరింత జటిలం అవుతోంది. జోన్-5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యర్థాలు వదిలేశారని పలువురు విమర్శిస్తున్నారు. వార్డుకు పూర్తి స్థాయి శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో పారిశుధ్య సిబ్బంది చెత్తా చెదారాలు తొలగించడంలో నిర్లక్ష్యం వహించడంతో నిత్యం మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. ఫలితంగా దుర్వాసన వెదజల్లడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు.

నిత్యం సమస్యే..

ఇక్కడ రహదారుల్లో మురుగు ప్రవహిస్తోంది. డ్రైన్లు శిథిలావస్థకు చేరడంతో అటుగా నడవలేకపోతున్నాం. శానిటరీ సిబ్బందికి నిత్యం ఇక్కడి కాలువలతో ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను సరిచేస్తే మురుగు ప్రవాహాలు బాగుంటాయి. నిత్యం అవస్థలు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

– కె.గోవిందరావు, స్థానికుడు, గొల్లకంచరపాలెం.

అధికారులు స్పందించాలి

వార్డులో సమస్యలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి పనులు చేపట్టాలి. అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో ఇంజినీరింగ్ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు చేపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి వ్యర్థాలు తొలగించాలి.

– ఆర్.నాగేశ్వరరావు, దుర్గానగర్

65వ వార్డులో జెడ్సీ విస్తృత పర్యటన



పారిశుధ్య సిబ్బందికి సూచనలిస్తున్న జోనల్ కమిషనర్ రాము

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ప్రకాష్‌నగర్‌లో జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము గురువారం విస్తృతంగా పర్యటించారు. శానిటేషన్, మలేరియా నివారణ విభాగానికి చెందిన కార్మికుల విధులను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి పనితీరును తెలుసుకున్నారు. అనంతరం ప్రకాష్‌నగర్‌లో ఓ ఇంటిపై నిర్మిస్తున్న సెల్ టవర్‌ను పరిశీలించిన ఆయన అందుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్సీ రాము మాట్లాడుతూ డ్రైడే-ఫ్రైడేపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరుచుకుని ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఖాళీ చేయాలని కోరారు. తద్వారా సీజనల్ వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ప్రజలు వ్యర్థాలను తడి-పొడి చెత్తగా ఇంటి వద్దే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చునని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కాలువల్లో, రహదారులపై చెత్త వేస్తే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జోన్-5 ప్రజారోగ్య శాఖ సహాయ కార్యదర్శి సునీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం, త్రినా, రమేష్, మల్కాపురం మలేరియా నివారణ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, జీవీఎంసీ సిబ్బంది, సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఉచిత వ్యాక్సినేషన్ నేడు

సింథియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సీఎస్సార్ కార్యక్రమాల్లో భాగంగా మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నియంత్రించే సెర్వావ్యాక్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గాంధీగ్రామంలోని ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ హ్యూమన్ పాపిల్లోమా వైరస్ కారణంగా దేశంలో అనేక మంది స్త్రీలు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు గురై, తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. అటువంటి వైరస్‌ను నియంత్రించడానికి రూపొందించిన సెర్వావ్యాక్ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించడానికి షిప్‌యార్డ్ సంస్థ సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చిందన్నారు. 14 నుంచి 40 ఏళ్ల లోపు మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పతకాలు



పతకాలు సాధించిన గోపీచంద్, దీక్షితలను అభినందిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: జాతీయ స్థాయిలో నోయిడాలోని ఆమిటీ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన యువజనోత్సవాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరఫున పాల్గొన్న ఇద్దరు విద్యార్థులు పతకాలు సాధించారు. ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగానికి చెందిన బి.గోపీచంద్, జి.దీక్షిత ప్రతిభ చూపారు. క్లే మోడలింగ్ విభాగంలో గోపీచంద్ మూడో స్థానం, రంగోలిలో దీక్షిత నాలుగో స్థానం సాధించారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అభినందించారు. జాతీయ స్థాయిలో భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రతిభను చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో నాణ్యమైన సరకులు విక్రయించాలి

మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్



టమాటాలను పరిశీలిస్తున్న యాసిన్

విశాఖ విద్య: వినియోగదారులకు నాణ్యమైన సరకులు అందించాలని జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ సూచించారు. మర్రిపాలెం రైతు బజారును ఆయన గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైతు బజార్‌లో రైతుల గుర్తింపు కార్డులు, డ్వాక్రా కౌంటర్లు, వ్యాపార దుకాణాలు పరిశీలించారు. బోర్డులపై సూచించిన ధరలకే కూరగాయలు అమ్మాలన్నారు. రైతులు తీసుకొస్తున్న టమాటాలతో పాటు అనంతపురం నుంచి వస్తున్న టమాటాలు పరిశీలించారు. టమాటాలు నాణ్యంగా ఉండేలా చూసుకోవాలని రైతుబజారు ఎస్టేట్ అధికారికి సూచించారు. దీనిపై రైతులకు, దుకాణదారులకు అవగాహన కల్పించాలన్నారు. బస్సు సౌకర్యం అవసరమైన రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి మూడో శనివారం రైతుబజారులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విధిగా నిర్వహించాలని, రైతులందరూ పాల్గొనాలని సూచించారు. రైతు బజారులో సౌకర్యాలు ఎలా ఉన్నాయనే దానిపై వినియోగదారులతో మాట్లాడారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై 28న చలో పార్లమెంట్

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధించి న్యాయం చేయాలని లేదంటే ఆందోళన తప్పదని భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ రాష్ట్ర సచివాలయంలో కార్మిక శాఖా మంత్రి పేషీలో ప్రత్యేక కార్యదర్శి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించి న్యాయం చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్, లోకేష్ హామీ ఇచ్చారని, హామీని అమలు చెయ్యమని ఎన్నిసార్లు కార్మిక శాఖా మంత్రిని, అధికారులను కలిసినా ఫలితం కనిపించలేదన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు గడిచినా తమ సమస్యలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధించి, పెండింగ్‌లో ఉన్న 44వేల క్లెయిమ్స్ పరిష్కరించాలని కోరారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులందరికీ హెల్త్ చెకప్స్ చెయ్యాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేక రంగాలలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సెస్సు వసూలు చెయ్యడం లేదని, ప్రభుత్వ కట్టడాలు, రోడ్లు భవనాలు, మున్సిపాలిటీలు, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ శాఖల్లో జరిగే నిర్మాణాల నుంచి ఒక్క శాతం సెస్సు వసూలు చేసి కార్మికులకు మేలు చేయాలని కోరారు. ఈనెల 28న భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎస్.వెంకటసుబ్బయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

మద్దిలపాలెం: చట్టాల గురించి విద్యార్థులు క్షుణ్ణంగా తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను లైగింక దాడులు, వేధింపుల నుంచి పోక్సో చట్టం-2012 రక్షిస్తుందన్నారు. నేరాల విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడానికి, వేగవంతమైన, సమర్థవంతమైన న్యాయాన్ని అందించడానికి ఈ చట్టం వీలు కల్పిస్తుందని వెంకట శేషమ్మ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాకింగ్ పార్కులో వ్యర్థాలు

- ఇబ్బంది పడుతున్న వాకర్స్
- నత్తనడకన అభివృద్ధి పనులు



వాకర్స్ కూర్చొనే ప్రదేశంలో డంప్ చేసిన వ్యర్థాలు



వాటర్ ట్యాంక్ ఉన్నా కనెక్షన్ ఇవ్వని వైనం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ వాకర్స్ పార్కులో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వాకర్స్ అసౌకర్యానికి గురవుతున్నారు. పార్కులో రక్షణ గోడ ఎత్తు పెంచడం,ముఖద్వారం మార్పు,పెయింటింగ్,మరుగుదొడ్లకు మరమ్మతులు, వాకింగ్ ట్రాక్ మార్పు వంటి అభివృద్ధి పనులు రెండు నెలల నుంచి చేస్తున్నారు.అయితే మరమ్మతుల నిమిత్తం తొలగించిన వ్యర్థాలు వాకింగ్ ట్రాక్‌పై, వాకర్స్ కూర్చునే ప్రదేశాల్లో డంప్ చేయడంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు.

అలంకార ప్రాయంగా ట్యాంకు

పార్కులో వాకర్స్ తాగునీటి(మంచినీరు) అవసరాలు తీర్చడానికి ఏర్పాటు చేసిన ట్యాంక్ అలంకార ప్రాయంగా ఉంది. ప్లాస్టిక్ వాటర్ ట్యాంక్‌కు పైపులైన్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ట్యాంక్‌లోకి నీరు వచ్చినా వినియోగానికి అవకాశం లేదు. గత వారం పూర్తి కావాల్సిన అభివృద్ధి పనులు ఇంకా కొనసాగుతుండడంతో అభివృద్ధి పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో..తాము ప్రశాంతంగా వాకింగ్ చేయడానికి ఎంత సమయం పడుతుందోనని వాకర్స్ ఆశగా ఎదురు చూస్తున్నారు.

విజయోస్తు..

- పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుల ఆశీస్సులు
- సందడిగా ఫేర్‌వెల్



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న హెచ్‌ఎం వేణుగోపాల్



అలరించిన విద్యార్థుల డ్యాన్సులు

గోపాలపట్నం: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ సూచించారు. ఏకాగ్రతతో చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్లో గురువారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరీక్షల్లో చదివినవి గుర్తు చేసుకుని, ప్రెజెంటేషన్ సరిగ్గా ఉండేలా చూసుకుంటే మంచి మార్కులు వస్తాయన్నారు. ఆరోగ్యం విషయంలోనూ జాగ్రత్త వహించాలన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్ష బాగా రాయాలంటూ ఆశీస్సులు అందించారు. విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. విద్యార్థుల డ్యాన్సులు, కేరింతలతో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం: మల్కాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్లలో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

11 కేవీ త్రినాథపురం ఫీడర్ పరిధిలో..

హరిజనవీధి,గాంధీజీవీధి,రజకవీధి ప్రాంతాలు..

మల్కాపురం 11 కేవీ ఫీడర్ పరిధిలో: వెంకన్నపాలెం, ఏడుగుడుల సెంటర్ ఏరియా,ఈఎస్ఐ ఆస్పత్రి,ఐఎంయూ (ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ) సీఈఎంఎస్ ఏరియా,సింథియా జంక్షన్ ఏరియా,పోస్టుఆఫీస్ ఏరియా.

11 కేవీ షిప్‌యార్డ్ -1 ఫీడర్‌లో..

ఎంఎస్‌ఆర్ బిల్డింగ్, ఎయిర్‌పోర్టు ఆథరైజ్డ్ ఏరియా,రాడార్ కేంద్రం,లైట్‌హౌస్,యారాడ హిల్స్, యారాడ విలేజ్.

షిప్‌యార్డ్-2 11 కేవీ ఫీడర్ పరిధిలో..

కాకరలోవ,జై ఆంధ్రకాలనీ,చింతల్లోవ,క్రాంతినగర్ ఏరియాలతో పాటు బీపీసీఎల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో బీపీసీఎల్ గొడౌన్స్, వై జంక్షన్,డాక్‌యార్డ్ ఏరియా,నవయుగ, శాతవాహన బస్టాప్ ఏరియా, కాకతీయ గేటు ఏరియాలు.. మల్కాపురం (ఆయిల్ ఫీడర్)11 కేవీ పరిధిలో.. ఐఎన్‌ఎస్ కల్యాణి ఆస్పత్రి ఏరియా, చింతామణి దుర్గాగణపతి ఆలయం ఏరియాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి

- హెచ్‌బీఎల్ ప్రతినిధి శ్రీకాంత్
- గోపాలపట్నం బాలికల హైస్కూల్లో గ్రంథాలయం ప్రారంభం



గోపాలపట్నంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌బీఎల్ ప్రతినిధి శ్రీకాంత్

గోపాలపట్నం: విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని హెచ్‌బీఎల్ సంస్థ ప్రతినిధి శ్రీకాంత్ అన్నారు. గోపాలపట్నం పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే విజ్ఞానం పెంచుకునేందుకు దోహద పడుతుందన్నారు. సెల్‌ఫోన్లు, టీవీలకు అలవాటు పడకుండా పుస్తకాలు చదివి కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథబూలయంలో విజ్ఞానం పెంపొందించే పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా గ్రంథాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. జేడీ ఫౌండేషన్ విశాఖ కన్వీనర్ సలాది కృష్ణయ్య మాట్లాడుతూ గ్రంథాలయం ఏర్పాటుకు హెచ్‌బీఎల్ సంస్థ రూ1.30 లక్షలు వెచ్చించిందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీవీడీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేసినందుకు హెచ్‌బీఎల్ సంస్థ ప్రతినిధులకు, జేడీ ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూరి అను, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మజ్జూరి శ్రీనివాసరావు, కార్యదర్శి వైఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 11 కిలోల గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా... విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్‌పీ ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి గురువారం విశాఖ రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన చిరుమామిళ్ల గోపి విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయిని రవాణా చేయడాన్ని ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని జీఆర్పీ సిబ్బందికి అప్పగించగా.. అతడి వద్ద నుంచి రూ.55 వేల విలువైన 11 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాదారుడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

బ్రెయిలీ ఉపకరణాల పంపిణీ

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీఈడీ కోర్సు పూర్తి చేసిన ప్రతి విద్యార్థి ఉపాధ్యాయ వృత్తిలో అడుగిడి ఉన్నతంగా రాణించాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు ఆకాంక్షించారు. విద్యా విభాగంలో గురువారం బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు బ్రెయిలీ ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఉన్న సమయాన్ని విభిన్న నైపుణ్యాలు, సామర్థ్యాలను అందిపుచ్చుకోవడానికి వినియోగించుకోవాలని సూచించారు. వర్సిటీ నుంచి బయటకు వెళ్లే సమయానికి ఉపాధి అవకాశం చేతిలో ఉండేలా ప్రతి విద్యార్థి తనను తాను మలుచుకోవాలన్నారు. అనంతరం విభాగంలో కాగ్నిజెంట్ ఫౌండేషన్ నుంచి స్కాలర్‌షిప్ పొందిన 13 మంది విద్యార్థులు తమతో పాటు చదువుకుంటున్న సహచర విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే బ్రెయిలీ లిపికి సంబంధించిన కిట్లు బహుకరించారు. విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ తాము సహాయం పొందడంతో పాటు ఇతరులకు సాయం చేయాలని ఆలోచన ఎంతో ఉన్నతమైనదన్నారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు డాక్టర్ ప్రకాష్, ఆలీ, కె.రాము, సలోమి, హేమలత, వినీల, మూర్తి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.